



నీలాకాశంలో సప్తవర్ణాల సింగిడి

చేర్యాలలో కొద్దిరోజులుగా నిత్యం ఆకాశంలో దట్టమైన మబ్బులు కమ్ముకుంటున్నా చినుకురాల్చడం లేదు. బుధవారం ఉదయం మబ్బుల చాటు నుంచి ఇంద్రధనస్సు విరబూసింది. సప్తవర్ణాల సొగసులతో కూడిన సింగిడి ఆకాశంలో ఆవిష్కృతం కావడంతో ప్రకృతి ప్రేమికులు ఆహ్లాదానికి లోనయ్యారు. పలువురు తమ సెల్‌ఫోన్లలో ఈ సప్తవర్ణాల సింగిడిని బంధించారు. - చేర్యాల, జూలై 10

రీజనల్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ మార్చాలి

- త్రిపుల్ ఆర్ బాధితుల ఐక్యవేదిక డిమాండ్



ప్రజ్ఞాపూర్ చౌరస్తాలో మోకాళ్లపై కూర్చుని నిరసన తెలుపుతున్న రీజనల్ రింగ్ రోడ్డు బాధితులు

గజ్వేల్, జూలై 10: గజ్వేల్ నియోజకవర్గంలోని గజ్వేల్, మర్కుక్, జగదేవ్‌పూర్ మండలాల్లో రీజనల్ రింగ్‌రోడ్డు అలైన్‌మెంట్‌ను మార్చాలని త్రిపుల్ ఆర్ భూనిర్వాసితుల ఐక్యవేదిక నాయకులు డిమాండ్ చేశారు. గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపాలిటీ పరిధిలోని ప్రజ్ఞాపూర్ చౌరస్తాలో మోకాళ్లపై కూర్చుని ప్రభుత్వానికి తమ నిరసనను తెలియజేశారు. ఈ సందర్భంగా భూనిర్వాసితులు మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ తమ స్వార్థం కోసం రీజనల్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్‌ను మార్చారని, కాంగ్రెస్ ప్రభుత్వం ఆ అలైన్‌మెంట్‌ను మారుస్తామని హామీ ఇచ్చిందన్నారు. ఇచ్చిన హామీ మేరకు, రైతుల గోసను అర్థం చేసుకుని అలైన్‌మెంట్‌ను మార్చాలని వారు డిమాండ్ చేశారు. ప్రస్తుతం ఉన్న సంగారెడ్డి-తూప్రాన్-గజ్వేల్-జగదేవ్‌పూర్-భువనగిరి-చిట్యాల రోడ్డును రీజనల్‌రింగ్ రోడ్డుగా మార్చాలని, అలా చేయడం వల్ల భూములు కోల్పోయే పరిస్థితి ఉండదని వారు స్పష్టం చేశారు. తమ భూముల్లో నుంచి ఇప్పటికే కాలువలు, రోడ్లు వెళ్లాయని, మరోసారి రీజనల్ రింగ్ రోడ్డు వెళితే తమ భూమిని పూర్తిగా కోల్పోయి రోడ్డున పడతామని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల పక్షాన ఆలోచించి అలైన్‌మెంట్ మార్చాలని డిమాండ్ చేశారు.



ములుగు మండల కేంద్రంలో కర్రల సాయంతో వేలాడుతున్న విద్యుత్ తీగలు



చిన్నకోడూరులోని ఓ పొలంలో వంగిన స్తంభం



సిద్దిపేట అర్బన్ మండలం క్రిష్ణసాగర్ శివారులో..

యమపాశాలు..

వేలాడుతున్న విద్యుత్ తీగలు

- ప్రమాదరకంగా స్తంభాలు
- ఆరు నెలల్లో 12 మంది దుర్మరణం
- 26 పశువుల మృత్యువాత
- క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ కరువు

అంధ్రజ్యోతి ప్రతినిధి, సిద్దిపేట, జూలై 10: నిరంతరం అప్రమత్తంగా ఉండాల్సిన విద్యుత్‌శాఖలో అలసత్వం ఆవహించింది. క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ కొరవడడంతో పుట్టెడు సమస్యలు దాపురించాయి. ఎప్పటికప్పుడు విద్యుత్ తీగలను, స్తంభాలను సరిచేయకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఫలితంగా నిండు ప్రాణాలు గాలిలో కలుస్తున్నాయి. నియంత్రణ చర్యలు చేపట్టడంలోనూ నిర్లక్ష్యమే కనిపిస్తోంది. ఉన్నతాధికారులు సూచిస్తున్నప్పటికీ కిందిస్థాయిలో మాత్రం ఆ దిశగా అడుగులు వేయడం లేదు.

సిద్దిపేట జిల్లాలో 1,68,810 వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. ప్రస్తుత వర్షాకాల సీజన్‌లో రైతులంతా తమ పంటపొలాలకు రాకపోకలు సాగిస్తున్నారు. అయితే వచ్చిపోయే దారుల్లో విద్యుత్ తీగలు వేలాడుతూ యమపాశాలుగా మారాయి. గడిచిన ఆరునెలల్లో 12 మంది మృత్యువాత పడ్డారు. 26 పశువులూ విద్యుత్‌షాక్‌తో చనిపోయాయి. విద్యుత్ స్తంభాలు సైతం పలుచోట్ల ఒంగి ప్రమాదకరంగా కనిపిస్తున్నాయి. ఇక స్తంభాలను అమర్చకపోవడంతో రైతులే కర్రలను ఊతంగా పెట్టి తీగలను విస్తరించడం మరింత ప్రమాదకరంగా మారిందనే చెప్పాలి. ఈదురుగాలులకు, వర్షాలకు ఈ కర్రలు నేలవాలితే ప్రాణాలు గాలిలో కలవాల్సిందే. వీటన్నింటినీ చక్కదిద్దాల్సిన విద్యుత్‌శాఖ అధికారులు, సిబ్బంది సరైన పర్యవేక్షణ చూపించకపోవడం విమర్శలకు తావిస్తోంది.

ప్రాణాలుపోతున్నా పట్టింపేది

ఆరునెలల్లోనే 12మంది చనిపోయారంటే పరిస్థితి ఎంత తీవ్రంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. పెరుగుతున్న సాంకేతికతతో విద్యుత్ ప్రమాదాలకు అడ్డుకట్ట పడాల్సిన అవసరం ఎంతైనా ఉంది. కానీ జిల్లాలో ప్రమాదాలు నిత్యకృత్యంగా మారుతున్నాయి. కొద్దిరోజుల కిందట సిద్దిపేటలో జరిగిన సబ్‌స్టేషన్ అగ్నిప్రమాదం రాష్ట్రమంతటా చర్చనీయాంశంగా మారింది. నాడు భారీగా ప్రాణాపాయం తప్పింది. కానీ తర్వాతి ఘటనల్లో పలుచోట్ల ప్రాణాలు కోల్పోయారు. దీనికి స్వీయ తప్పిదాలతోపాటు విద్యుత్‌శాఖ లోటుపాట్లు కూడా లేకపోలేదు. ఈ విషయంపై ప్రత్యేక దృష్టిసారించాల్సిన అధికారులు సరైన పర్యవేక్షణ కేంద్రీకరించడం లేదు.





కుకునూరుపల్లిలోని ట్రాన్స్‌ఫార్మర్ గద్దెకు పగుళ్లు



చేర్యాల నుంచి ఆకునూరు వెళ్లే దారిలో పక్కకు ఒరిగిన కరెంటు స్తంభం



చిన్నకోడూరులోని పెద్దచెరువుకట్ట రహదారిపై ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్



బెజ్జంకి మండలం ముత్తన్నపేటలోని కాటన్‌మిల్లు సమీపంలో చేతికందుతున్న విద్యుత్ తీగలు

బదిలీపై వెళ్తున్న టీచర్ల కాళ్లు కడిగిన నేతలు

సిద్దిపేట అర్బన్, జూలై 10: సిద్దిపేట అర్బన్ మండలం బూరుగుపల్లి గ్రామ యూపీఎస్‌లో 12 ఏళ్లుగా విధులు నిర్వర్తించి, బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులను సన్మానించిన గ్రామానికి చెందిన మాజీ ప్రజాప్రతినిధులు వారి పాదాలను కడిగారు. గ్రామంలో పాఠశాల ఎత్తివేసే పరిస్థితుల్లో ఉండగా, ఉపాధ్యాయులు 'ప్రైవేట్ స్కూల్ వద్దు.. ప్రభుత్వ పాఠశాల ముద్దు' అనే నినాదంతో గ్రామంలోని ఇంటింటికీ వెళ్లి పిల్లలను స్కూల్‌లో చేర్పించారు. అప్పటి నుంచి గ్రామంలోని పరిసర ప్రాంతాల్లోని విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పించి, వారిని తీర్చిదిద్దారు. ఈ పాఠశాలలో చదివిన పలువురు విద్యార్థులు త్రిబుల్ ఐటీలోనూ సీటు సాధించారు. అయితే, పాఠశాలకు చెందిన ఉపాధ్యాయులు శైలజ, హరిత, భాగ్యమ్మ, శ్రీకాంత్ బదిలీపై వెళ్తుండగా బుధవారం పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా గ్రామ తాజా మాజీ ప్రజాప్రతినిధులు కమలాకర్‌రావు, రామరాజులు వారి పాదాలు కడిగారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పద్మజ, ఉపాధ్యాయులు శ్రీనివాస్, రాజేశ్వరి, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.



ఉపాధ్యాయుల పాదాలు కడుగుతున్న మాజీ ప్రజాప్రతినిధి

అబార్షన్ చేసిన ఆసుపత్రి నిర్వాహకుల రిమాండ్

హుస్నాబాద్, జూలై 10: ఎనిమిది నెలల గర్భవతికి ఇష్టం లేకుండా అబార్షన్ చేసిన కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ పట్టణంలోని మాధవి నర్సింగ్ హోం నిర్వాహకుడు కర్ర పాపిరెడ్డి, అతనికి సహకరించిన సిబ్బందిని బుధవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపినట్లు హుస్నాబాద్ సీఐ శ్రీనివాస్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం హుస్నాబాద్‌కు చెందిన సుమేరా బేగం, ఉప్పుల రాంరెడ్డిని వివాహం చేసుకుంది. ఆమె ఎనిమిది నెలల గర్భవతిగా ఉన్నపుడు ఆరోగ్యం బాగోలేక ఫిబ్రవరిలో తల్లి వద్దకు వెళ్లింది. చెకప్ కోసమని చెప్పి తన తల్లి సయ్యద్ హసినా బేగంతో పాటు బంధువులు హుజూరాబాద్‌లోని మాధవి నర్సింగ్ హోంకు తీసుకెళ్లి అబార్షన్ చేయించారు. విషయం తెలుసుకున్న సుమేరా బేగం ఫిబ్రవరి 29న ఫిర్యాదు చేయగా ఎస్ఐ తోట మహేశ్ కేసు నమోదు చేసి సుమేరా బేగం తల్లి సయ్యద్ హసినా బేగం, బంధువులైన మహ్మద్ సహిద, షేక్ సైపుద్దీన్, సిరిశెట్టి అశోక్‌ను రిమాండ్‌కు తరలించారు. నాటి నుంచి పరారీలో ఉన్న హుజూరాబాద్‌లోని మాధవి నర్సింగ్ హోం నిర్వాహకుడు కర్ర పాపిరెడ్డి, అబార్షన్ చేసిన థియేటర్ ఆపరేటర్స్ రావుల సత్యనారాయణ, లక్ష్మిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.



నిందితులను అరెస్టు చేసి వివరాలు వెల్లడిస్తున్న సీఐ శ్రీనివాస్



ఓల్డ్ పెట్రోల్‌పంప్ ఏరియాలో ఆరు బయట ప్రవహిస్తున్న మురుగునీరు

హవ్వ.. బ్లీచింగ్ పౌడర్ లేదట!

- చేర్యాల మున్సిపాలిటీలో అస్తవ్యస్తంగా పారిశుధ్యం
- డ్రైనేజీ కంపుతో ప్రజల ఇబ్బందులు

చేర్యాల, జూలై 10 : అసలే వర్షాకాలం.. పైగా సీజనల్ వ్యాధులు విజృంభిస్తుంటాయి. ఈ సమయంలో మున్సిపల్ అధికారులు.. సిబ్బంది ఎంతో అప్రమత్తంగా ఉండాలి. ఎప్పటికప్పుడు వీధులను శుభ్రంగా ఉంచాలి.. కానీ చేర్యాల మున్సిపాలిటీలో మాత్రం పారిశుధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. ఇక అసలు విషయమేమిటంటే మున్సిపాలిటీలో బ్లీచింగ్ కరువైంది.. చేర్యాల పట్టణంలో 20వేలకుపైగా జనాభా, 4,500కుపైగా ఇళ్లు, దుకాణాలున్నాయి. యేటా కోటిన్నరకు పైగా ఆదాయం సమకూరుతున్నా కనీసం బ్లీచింగ్ సమకూర్చుకోలేని స్థితిలో కొట్టుమిట్టాడుతుండడం గమనార్హం. పట్టణంలో ఏడాదిగా జాతీయ రహదారి విస్తరణ పనులు కొనసాగుతున్నాయి. ఈ క్రమంలో విద్యుత్ స్తంభాల మార్పు వల్ల డ్రైయినేజీ కాలువ నిర్మాణాన్ని పలుచోట్ల మధ్యలోనే వదిలేశారు. దీంతో ఒక్కోసారి డ్రైయినేజీ నీరు పొంగిపొర్లుతూ కంపు కొడుతుంది. రోడ్డు వెంబడి ఎక్కడ చూసినా దుర్గంధం, దుర్వాసన వెదజల్లుతున్నా మునిసిపాలిటీలో బ్లీచింగ్ లేదని చెబుతున్నారు. దీనికి తోడు పారిశుధ్య చర్యలు సరిగా చేపట్టకపోవడంతో పాటు కాలనీల్లోని ప్రజలు, రోడ్డుపక్కన దుకాణదారులు ఆరుబయట ఇష్టారాజ్యంగా చెత్తను, వ్యర్థాలను పారబోస్తున్నారు. పన్నులు చెల్లించకపోతే మాత్రం తాళాలు వేస్తూ కఠినంగా వ్యవహరించే అధికారులు డ్రైయినేజీలు పొంగిపొర్లుతున్నా కనీసం బ్లీచింగ్ చల్లకపోవడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సీజనల్ వ్యాధులు, జ్వరాలు ప్రబలుతున్నప్పటికీ పారిశుధ్య చర్యలు చేపట్టకపోవడంపై మండిపడుతున్నా రు. పాలకమండలి పట్టింపులేనితనంపైనా విస్మయం వ్యక్తంచేస్తున్నారు. గతంలో డెంగీ బారిన పడి పట్టణానికి చెందిన పలువురు మరణించిన క్రమంలో మరొకరికి ప్రాణాపాయం తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని, డ్రైయినేజీ నిల్వ ఉంటున్న ప్రదేశాల్లో బ్లీచింగ్ చల్లడంతో పాటు దోమల నివారణకు ఫాగింగ్ చేపట్టాలని ప్రజలు కోరు తున్నారు.

త్వరలోనే స్టాక్ తెప్పిస్తాం..

వర్షాకాలం దృష్ట్యా ముందస్తుగా బ్లీచింగ్ తెప్పించినప్పటికీ 15 రోజుల్లో 20 బ్యాగుల పౌడర్ చల్లారు. దీంతో స్టాకు అయిపోయింది. పట్టణంలో మురుగునీరు నిల్వ ఉన్న ప్రదేశాలలో బ్లీచింగ్ వేశాం. స్టాకును త్వరలో తెప్పిస్తాం. రాగానే బ్లీచింగ్ పౌడర్ చల్లుతాం.

- జి.నర్సయ్య, ఇన్‌చార్జి మునిసిపల్ కమిషనర్



యథేచ్ఛగా ఇసుక రవాణా

- మోయతుమ్మెద వాగు నుంచి జోరుగా తరలింపు
- నామమాత్రంగా అధికారుల తనిఖీలు

దూళిమిట్ట, జూలై 10 : దూళిమిట్ట మండలంలో కొందరు ఇసుకాసురులు వాల్టా చట్టానికి తూట్లు పొడుస్తున్నారు. మండలంలోని జాలపల్లి గ్రామంలోని మోయతుమ్మెద వాగు నుంచి ఇసుకను యథేచ్ఛగా తరలిస్తూ సొమ్ముచేసుకుంటున్నారు. ఇందులో పోలీసులు, రెవెన్యూ అధికారులకు కూడా ముడుపులు అందుతున్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికే వర్షాలు కురవక, భూగర్భజలాలు అడుగంటి రైతులు పంటను కాపాడుకునేందుకు నానా అవస్థలు పడుతున్నారు. ఈ క్రమంలో వాగులో ఇష్టానికి తోడేస్తుంటే సమీప రైతులు ఆందోళన చెందుతున్నారు. అడపదడపా పోస్తున్న బోర్లు కూడా నిరుపయోగంగా మారుతాయని ఆవేదన చెందుతున్నారు.



వాగులో ట్రాక్టర్ టైర్ల ఆనవాళ్లు

వీళ్లు సీజ్ చేస్తరు.. వాళ్లు వేలంలో పాల్గొంటరు..

పత్రికల్లో ఇసుక అక్రమ రవాణాపై కథనాలు ప్రచురితమైనపుడు అధికారులు హడావిడి చేసి ఇసుక వాహనాలను సీజ్ చేశారు. అలా సీజ్ చేసి వేలం పాట నిర్వహించేపుడు బయట వ్యక్తులు ఎవరూ పాల్గొనకుండా ఇసుక మాఫియా సభ్యులు జాగ్రత్తపడతారు. ఎవరి ఇసుకను సీజ్ చేసి డంప్ చేశారో వారే మళ్లీ వేలంపాటలో పాల్గొని అధికారికంగా దక్కించుకుంటారు. వేలం పాట పూర్తయిన తర్వాత రెవెన్యూ అధికారులు ఇచ్చే అనుమతి పత్రాలను చూపించి సీజ్ చేసిన ఇసుకతో పాటు ఎక్కువ అధిక ట్రిప్పుల ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్నారు. ఇదంతా పర్యవేక్షించాల్సిన అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. ఉన్నతాధికారులు దృష్టిసారించి ఇసుక అక్రమ రవాణాను అడ్డుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.



జాలపల్లి మోయతుమ్మెద వాగులో ఇసుక తోడడంతో తేలిన రాళ్లు

ఇసుక అక్రమ రవాణా చేస్తే చర్యలు

దూళిమిట్ట మండలం జాలపల్లిలోని మోయతుమ్మెద వాగు నుంచి ఇసుక అక్రమ రవాణా చేస్తున్నట్లు మాదృష్టికి వచ్చింది. గతంలో కూడా అక్రమ రవాణా చేస్తున్న వాహనాలను సీజ్ చేశాం. అయినా కొందరిలో మార్పు రావడం లేదు. ఇసుక అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలతో పాటు రూ.లక్ష జరిమానా తప్పదు. త్వరలో గ్రామసభ పెట్టి వాల్టాచట్టం పై అవగాహన కల్పిస్తాం. గ్రామస్థాయిలో సిబ్బంది సరిగా లేకపోవడం వల్లే ఇసుక రవాణాను అరికట్టలేకపోతున్నాం.

- ఎర్రోళ్ల శ్యాం, తహసీల్దార్

ఈడీ పేరిట బురిడీ

- సైబర్ నేరగాళ్ల కొత్త ఎత్తులు
- లక్షలు పోగొట్టుకుంటున్న బాధితులు

సంగారెడ్డి క్రైం, జూలై 10 : గతంలో సైబర్ నేరగాళ్లు ఆధార్‌కార్డు, పాన్‌కార్డు అప్‌డేట్, అనుసంధానం అంటూ వాటి లింకులను పంపి లేదా ఓటీపీలను చెప్పమని బ్యాంకు ఖాతాలోని డబ్బు కొట్టేసేవారు. ఇటీవల పార్ట్‌టైం జాబ్, ఆన్‌లైన్ ట్రేడింగ్ అంటూ డబ్బు స్వాహా చేసిన ఘటనలూ వెలుగు చూడగా, తాజాగా సైబర్ కేటుగాళ్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) పేరు చెప్పి బురిడీ కొట్టించి లక్షల రూపాయలు దండుకుంటున్నారు. సంగారెడ్డి జిల్లాలో గత సంవత్సరంలో మొత్తం 323 కేసులు నమోదయ్యాయి. సైబర్ నేరగాళ్ల చేతిలో బాధితులు రూ.22.71 కోట్లను పోగొట్టుకున్నారు. ఇందులో పోలీసులకు సకాలంలో బాధితులు ఫిర్యాదు చేయగా రూ.3.62 కోట్లు హోల్డ్ చేయడం జరిగింది.

ఉన్నతాధికారికి రూ.5 కోట్లు ఎగనామం

ఇటీవల పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి ఇంటిపై ఈడీ అధికారులు దాడి చేసిన నేపథ్యంలో సైబర్ నేరగాళ్లు ఆ సంఘటనను ఆసరాగా చేసుకుని ఓ వ్యక్తిని మోసం చేశారు. ఈనెల 6వ తేదీన పటాన్‌చెరులో ఈడీ పేరుతో రూ.3 లక్షల కాజేశారు. పటాన్‌చెరు మండలం లక్డారంకు చెందిన ఓ వ్యక్తికి ఈనెల 1వ తేదీన అపరిచిత వ్యక్తి ఫోన్ చేశాడు. తాను ముంబై ఈడీ కార్యాలయం నుంచి ఫోన్ చేస్తున్నానని నీపై మనీ ల్యాండరింగ్ కేసు నమోదైందని బెదిరించి ఆధార్, బ్యాంకు వివరాలు తీసుకున్నాడు. ఫోన్‌కు వచ్చిన ఓటీపీ సైతం చెప్పడంతో బ్యాంకు నుంచి రూ.3లక్షలు పోయినట్టు తర్వాత గుర్తించాడు. అలాగే సంగారెడ్డి సమీపంలోని కేంద్ర ప్రభుత్వ సంస్థలో పనిచేస్తున్న ఉన్నతాధికారి సైతం సైబర్ నేరగాళ్ల బారిన పడి రూ.5కోట్లు బ్యాంకు ఖాతా నుంచి పోగొట్టుకున్నట్టు పోలీసుల వర్గాల ద్వారా తెలిసింది.

బ్యాంకు ఖాతాలో డబ్బు లేకున్నా..

బ్యాంకు ఖాతాల్లో డబ్బు ఉన్న వారినే కాకుండా లేకున్నా సైబర్ నేరగాళ్లు కొట్టేస్తున్నారు. గుర్తు తెలియని ఓ ఫోన్ నంబర్ ద్వారా వాట్సాప్ గ్రూప్ లేదా ఇన్‌స్టాగ్రామ్‌లో యాడ్ చేస్తారు. ఇందులో టాస్క్‌ల పేరిట వర్క్ ఇస్తారు. వాటిని పూర్తి చేసిన తర్వాత డబ్బు పంపడానికి పే యాప్‌ల లింకులు ఇవ్వాలని, లేదా బ్యాంకు అకౌంట్‌ను ఇవ్వాలని కోరుతుంటారు. ముందుగా ఇచ్చిన టాస్క్ పూర్తిచేసిన తర్వాత మీ బ్యాంకు ఖాతాలో డబ్బు జమ చేస్తామని పేరు, వయస్సు, వృత్తి, ఫోన్ నంబరు ఇతర పూర్తి వివరాలు సేకరిస్తారు. నమ్మించడానికి మొదటగా కొంత డబ్బు పంపుతారు. ఆశపడిన బాధితుల నుంచి విడతల వారీగా బ్యాంకు ఖాతా నుంచి లక్షల్లో డబ్బు సైబర్ నేరగాళ్లు లాగేస్తారు. ఇక ఖాతాల్లో డబ్బు లేకుంటే మరో ప్రణాళికను అమలు చేస్తున్నారు. వివిధ బ్యాంకుల నుంచి పర్సనల్ లోన్లు ఇస్తామంటూ ప్రతి ఒక్కరికీ అనేక ఫోన్ కాల్స్ వస్తున్న విషయం తెలిసిందే. ఇలా కొన్ని బ్యాంకు లోన్ విభాగాలతో సైబర్ నేరగాళ్లు అప్రోచ్ అయి బాధితులకు సంబంధించిన వివరాలు ఇస్తారు. దీంతో బాధితుల బ్యాంకు ఖాతాలకు రుణం ఇప్పిస్తారు. ఈ డబ్బుతో టాస్క్‌లు పూర్తి చేయించి కొద్దికొద్దిగా బ్యాంకు ఖాతాలో ఉన్న మొత్తం డబ్బును కాజేస్తారు.





విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

- మెదక్ జిల్లా విద్యాశాఖ అధికారి రాధాకిషన్
- వెల్దుర్తి కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల ఆకస్మిక తనిఖీ

వెల్దుర్తి, జూలై 10: విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని, భోజనంలో నాణ్యత లేకపోతే చర్యలు తప్పవని మెదక్ జిల్లా విద్యాశాఖ అధికారి రాధాకిషన్ హెచ్చరించారు. బుధవారం వెల్దుర్తి కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలను, ఉప్పులింగాపూర్ ప్రాథమిక పాఠశాలలను ఆకస్మికంగా సందర్శించారు. అలాగే వెల్దుర్తి ఎంఆర్‌సీలో ఎంఈవో యాదగిరితో కలిసి మండలంలో జరుగుతున్న అమ్మ ఆదర్శ పనుల గురించి సమీక్ష నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... ఉప్పులింగాపూర్ ప్రాథమిక పాఠశాలలకు విద్యార్థులకు తక్కువగా హాజరు కావడం జరిగిందని, ఉపాధ్యాయులు విద్యార్థుల ఇంటికి వెళ్లి బడికి వచ్చే విధంగా కృషి చేయాలని సూచించారు. ఉపాధ్యాయులు ప్రణాళిక తయారు చేసుకోని విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించి మెరుగైన ఫలితాలు వచ్చేవిధంగా కృషి చేయాలని సూచించారు. జిల్లాలో అమ్మ ఆదర్శ పాఠశాలల పనులు 90శాతం వరకు పూర్తయ్యాయని, ఇప్పటివరకు పనులకు సంబంధించి 75 శాతం నిధులు విడుదల చేశామని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న పనులను ఐదురోజుల్లో పూర్తి చేయాలని, లేకపోతే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. పనులు పూర్తిగా జరిగిన చోట బిల్లులు వెంటనే చెల్లించాలని కలెక్టర్ ఆదేశించారని తెలిపారు. విద్యార్థులకు ఇబ్బందులు కలుగకుండా ప్రభుత్వం ఉచితంగా అందించే పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్స్ పంపిణీ చేశామని డీఈవో రాధాకిషన్ తెలిపారు.



అమ్మ ఆదర్శ పాఠశాలల పనుల గురించి ఎంఈవో యాదగిరిని వివరాలు అడిగి తెలుసుకుంటున్న డీఈవో రాధాకిషన్

నగదు ప్రోత్సాహకాలు అందజేత

వెల్దుర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2023-24లో పదో తరగతి ఫలితాల్లో ప్రథమ, ద్వితీయ స్థానాలను సాధించిన విద్యార్థులకు వెల్దుర్తి పట్టణానికి చెందిన నరేందర్ తన తండ్రి జ్ఞాపకార్థం నగదును అందజేశారు. ఈ సందర్భంగా నరేందర్‌ను జిల్లా విద్యాశాఖ అధికారి రాధాకిషన్, వెల్దుర్తి ఎంఈవో యాదగిరి అభినందించారు. ఈ కార్యక్రమంలో వెల్దుర్తి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సాంబయ్య, ఆయా పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బైపాస్ నిర్మాణ స్థలాల పరిశీలన

రామాయంపేట, జూలై 10: సిద్దిపేట నూతన బైపాస్ నిర్మాణ స్థలాలను మెదక్ అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు బుధవారం పరిశీలించారు. హైవే అథారిటీ అధికారులతో కలిసి జంక్షన్లు, రోడ్డు మార్గం ఎక్కడి నుంచి వెళ్తుందన్న దానిపై వివరాలు సేకరించారు. కొత్త హైవే విస్తరణలో భాగంగా రెండున్నర కిలో మీటర్ల మేర బైపాస్ నిర్మిస్తున్నారు. దీంతో తమ విలువైన భూములు పోతున్నాయంటూ పలువురు రైతులు అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లుకు మొరపెట్టుకున్నారు. బైపాస్ వద్దంటూ ఆయనకు విన్నవించారు.

ముదిరాజ్‌లకు మంత్రివర్గంలో ప్రాధాన్యతనివ్వాలి

- ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు యాదగిరి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ముదిరాజ్ సంఘం నాయకులు

సంగారెడ్డి రూరల్, జులై 10: ముదిరాజ్‌లకు మంత్రివర్గంలో ప్రాధాన్యతనివ్వాలని ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు యాదగిరి డిమాండ్ చేశారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బండ ప్రకాష్ ఆదేశాల మేరకు సంగారెడ్డిలో బుధవారం సమావేశం నిర్వహించి పోస్టర్ ఆవిష్కరించి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అభయహస్తంలో ఇచ్చిన హామీ మేరకు ముదిరాజ్‌లను బీసీ డీ నుంచి బీసీ ఏ గ్రూప్‌లోకి మార్చాలని డిమాండ్ చేశారు. అనంతరం సంఘం రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షురాలు మందుల వరలక్ష్మి మాట్లాడుతూ ప్రభుత్వం ముదిరాజ్ విద్యార్థులకు గురుకుల పాఠశాలలను ఏర్పాటు చేయాలన్నారు. ఈ సమావేశంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నారాయణ, జిల్లా నాయకులు భూలక్ష్మి, లావణ్య, ప్రియ. డా. శిల్ప, హరీశ్‌కుమార్, శైలజ తదితరులు పాల్గొన్నారు.

ధరణి సమస్యల పరిష్కారం దిశగా కృషి: తహసీల్దార్

జహీరాబాద్, జూలై 10: జహీరాబాద్ మండలంలోని ఆయా గ్రామాల్లో నెలకొన్న ధరణి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని తహసీల్దార్ రవీందర్ పేర్కొన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ధరణి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తున్న నేపథ్యంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ధరణికి సంబంధించిన వివిధ రికార్డులను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నామన్నారు. జహీరాబాద్ మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన 1,200 మంది రైతులు ధరణి సమస్యలు ఉన్నాయమంటూ దరఖాస్తులు చేసుకున్నారని తెలిపారు. ఇప్పటివరకు 1000 మంది రైతుల సమస్యలను పరిష్కరించామన్నారు.









తూప్రాన్ అర్బన్ పీహెచ్‌సీకి కేటాయించిన భూమి, ఆస్పత్రి కోసం కేటాయించిన భూమిలో సర్వే చేస్తున్న అధికారులు

యూపీహెచ్‌సీపై నీలినీడలు

- ఏడాది క్రితం మంజూరు
- అప్పుడే అర్బన్ పీహెచ్‌సీ భూమి కేటాయింపు
- తూప్రాన్ మండల ప్రజలు, గర్భిణుల తీవ్ర అవస్థలు

పేదలకు వైద్యమందించేందుకు మంజూరు చేసిన అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (యూపీహెచ్‌సీ) ఏర్పాటుపై నీలినీడలు కమ్ముకున్నాయి. ఏడాది క్రితమే యూపీహెచ్‌సీ మంజూరైనా ఏర్పాటుకు అధికారులు శ్రద్ధ చూపించడం లేదు. ఫలితంగా పేదలు, గర్భిణులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

తూప్రాన్, జూలై 10: మెదక్ జిల్లా తూప్రాన్ పట్టణంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఉండగా.. గజ్వేల్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న మాజీ సీఎం కేసీఆర్ తూప్రాన్ పట్టణానికి 50 పడకల ఆస్పత్రికి మంజూరు చేశారు. రూ.11 కోట్లతో నిర్మించిన 50 పడకల సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని 2018 జనవరి 17న కేసీఆర్ ప్రారంభించారు. సామాజిక ఆరోగ్య కేంద్రం (సీహెచ్‌సీ), ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ) పక్కపక్కనే ఉండటం, సీహెచ్‌సీ ఏర్పాటుతో పీహెచ్‌సీకి నిధులు, మందుల కేటాయింపు నిలిపివేశారు. దాంతో నూతనంగా ఏర్పాటుచేసిన మనోహరాబాద్ మండలానికి తూప్రాన్ పీహెచ్‌సీ పంపించాలని అధికారులు నిర్ణయించారు. తూప్రాన్ పీహెచ్‌సీని మనోహరాబాద్‌కు బదిలీ చేస్తూ ఆదేశాలు రావడంతో, 2022 సెప్టెంబరులో పీహెచ్‌సీని అక్కడికి బదిలీ చేశారు. మనోహరాబాద్‌లో ఆస్పత్రి భవన నిర్మాణం కూడా చేపట్టారు. తూప్రాన్ పీహెచ్‌సీని మనోహరాబాద్ మండలానికి బదిలీ చేయడంతో రోగులు, ప్రజలు, గర్భిణులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తూప్రాన్ మండలంలో ఘనపూర్, గుండ్రెడ్డిపల్లి, నాగులపల్లి, రావెల్లి, తూప్రాన్-1, తూప్రాన్-2 ఆరు సబ్ సెంటర్లు నిర్వహిస్తున్నారు. తూప్రాన్ మండలంలో పీహెచ్‌సీ లేకపోవడంతో మనోహరాబాద్ పీహెచ్‌సీకి వెళ్లాల్సి వస్తున్నది. తూప్రాన్ మండలంలో పనిచేస్తున్న ఏఎన్ఎంలు వెళ్లి విధులు చేయాల్సి ఉండగా, గర్భిణులు మనోహరాబాద్ మండల పీహెచ్‌సీకి వెళ్లి పరీక్షలు చేయించుకోవాల్సి వస్తుంది. ఈ ఇబ్బందులను స్థానిక రాజకీయ నాయకులు అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో పాటు తూప్రాన్ పట్టణానికి అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటు చేయాలని పలు మార్లు అభ్యర్థించారు. తెలంగాణ వ్యాప్తంగా 24 అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు మంజూరు చేస్తూ 2023 ఆగస్టు 31న ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖ కమిషనర్ ఆదేశాలు జారీచేశారు. ఉమ్మడి మెదక్ జిల్లాలో తూప్రాన్ పట్టణానికి యూపీహెచ్‌సీతోపాటు మెదక్, జహీరాబాద్, తెల్లాపూర్, సిద్దిపేట, గజ్వేల్ పట్టణాలకు యూపీహెచ్‌సీలను మంజూరు చేశారు. యూపీహెచ్‌సీ ఒక్కొక్క భవన నిర్మాణానికి 15వ ఫైనాన్స్ నిధుల నుంచి రూ.1.43 కోట్లు మంజూరు చేశారు. యూపీహెచ్‌సీ ఏర్పాటుకు భూమి కేటాయించాలని కలెక్టర్‌ను కోరడంతో ఆగమేఘాల మీద భూమి కేటాయింపులు చేపట్టారు. తూప్రాన్ పట్టణంలో డబుల్ బెడ్‌రూం ఇళ్ల వద్ద సర్వేనంబరు 325లో 0.17 గుంటల భూమి కేటాయిస్తూ అప్పటి కలెక్టర్ రాజర్షిషా 2023 సెప్టెంబరు 15న ఆదేశాలు జారీచేశారు.

గర్భిణులకు తీవ్ర అవస్థలు



తూప్రాన్‌కు మంజూరైన యూపీహెచ్‌సీ వెంటనే ఏర్పాటు చేయాలి. మల్కాపూర్, కోనాయపల్లి గ్రామాలకు చెందిన గర్భిణులు పరీక్షలకు మనోహరాబాద్ వెళ్లడానికి ఇబ్బందులు పడుతున్నారు. గర్భిణులు సుమారు 25 కిలోమీటర్ల దూరం వెళ్లాల్సి వస్తుంది. అధికారులు స్పందించి వెంటనే యూపీహెచ్‌సీని ఏర్పాటు చేయాలి.

- పంజాల వెంకటమ్మ, తాజా మాజీ ఎంపీటీసీ, మల్కాపూర్

భూమి కేటాయింపు మాత్రమే..

తూప్రాన్ పట్టణానికి యూపీహెచ్‌సీ మంజూరై ఏడాది కావస్తున్నా అడుగు ముందుకు పడడం లేదు. రెవెన్యూ అధికారులు భూమి కేటాయించినప్పటికీ భవన నిర్మాణ పనులేమి జరగడం లేదు. భవన నిర్మాణ పనుల విషయం అటుంచితే, యూపీహెచ్‌సీ ఏర్పాటు చేసి పేదలకు వైద్యం అందజేయడం లేదు. యూపీహెచ్‌సీ ఏర్పాటు చేయకపోవడంతో తూప్రాన్ మండలంలోని మల్కాపూర్, కోనాయపల్లి గ్రామాల రోగులు 25 కిలోమీటర్ల దూరంలో మనోహరాబాద్ పీహెచ్‌సీకి వెళ్లాల్సి వస్తుంది. యూపీహెచ్‌సీ ఏర్పాటు లేకపోవడంతో ఘనపూర్, నాగులపల్లి సబ్‌సెంటర్ల రోగులు మనోహరాబాద్ వెళ్లలేకపోతున్నారు. యూపీహెచ్‌సీని వెంటనే ఏర్పాటు చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

ఆర్టీసీ రాజధాని బస్సులో భారీ చోరీ

● తూప్రాన్ దాబా వద్ద రూ.5 లక్షలు అపహరణ

తూప్రాన్, జూలై 10: ఆర్టీసీ రాజధాని ఎక్స్‌ప్రెస్ బస్సులో ప్రయాణిస్తున్న వ్యాపారి వద్ద భారీ నగదు చోరీ జరిగింది. ఈ సంఘటన మెదక్ జిల్లా తూప్రాన్ పట్టణ శివారులో హైవే బైపాస్‌లో దాబా హోటల్ వద్ద మంగళవారం రాత్రి జరిగింది. తూప్రాన్ ఎస్‌ఐ శివానందం వివరాల ప్రకారం.. హైదరాబాద్ కొంపెల్లికి చెందిన అమీన్ అబ్దుల్ లలాని కొద్దిరోజులుగా మసాల వ్యాపారం నిర్వహిస్తున్నాడు. నిజామాబాద్ పట్టణానికి చెందిన ఇమ్రాన్ వద్ద మసాల సరఫరా చేసిన డబ్బులు తీసుకురావడానికి మంగళవారం నిజామాబాద్‌కు వెళ్లాడు. రూ.5 లక్షలు తీసుకొని కాలేజీ బ్యాగ్‌లో పెట్టుకొని నిజామాబాద్ నుంచి కొంపెల్లికి రాజధాని ఎక్స్‌ప్రెస్‌లో బయల్దేరాడు. రాత్రి తూప్రాన్ పట్టణ శివారు హైవే బైపాస్‌లోని వినోద్ దాబా హోటల్ వద్ద బస్సు ఆగింది. డబ్బులున్న బ్యాగ్ సీటులో పెట్టి భోజనం చేసేందుకు కిందికి దిగాడు. భోజనం చేసి బస్సులోకి వచ్చి చూడగా రూ.5 లక్షల నగదున్న బ్యాగ్ కనిపించలేదు. చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో బుధవారం తూప్రాన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శివానందం తెలిపారు.

ప్రభుత్వ నిషేధిత గుట్కాలు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న గుట్కా, ప్యాకెట్లను చూపిస్తున్న టూ టౌన్ పోలీసులు

సిద్దిపేట క్రైం, జూలై 10: సిద్దిపేట టూ టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో నిషేధిత గుట్కా ప్యాకెట్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సిద్దిపేట ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌యార్డులోని ఓ షాపులో ప్రభుత్వం నిషేధించిన వివిధరకాల గుట్కా ప్యాకెట్లు ఉన్నాయని నమ్మదగిన సమాచారంతో సిద్దిపేట టాస్క్‌ఫోర్స్ అధికారులు, టూ టౌన్ పోలీసులు తనిఖీ చేశారు. ఈ క్రమంలో రూ.61,108 వేల విలువచేసే గుట్కా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు టూ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

స్కిట్, కవిత పోటీల విజేతలకు నగదు బహుమతి



విజేతలకు నగదు బహుమతిని అందజేస్తున్న డీఈవో వెంకటేశ్వర్లు

సంగారెడ్డి అర్బన్, జూలై 10: ఓటరు చైతన్య కార్యక్రమంలో భాగంగా ప్రతిఒక్కరూ తమ ఓటుహక్కు వినియోగించుకోవాలని రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు అసెంబ్లీ ఎన్నికల సమయంలో జిల్లా ఎన్నికల అధికారి ఆధ్వర్యంలో స్వీప్ ఫ్యూచర్ ఓటర్, యంగ్ ఓటర్స్ పేరిట విద్యార్థులకు స్కిట్ కాంపిటేషన్, కవిత, పాటల పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో విజేతలుగా నిలిచిన పాఠశాలలకు కలెక్టర్ ఆదేశాల మేరకు రూ.30 వేల పారితోషికం అందించారు. స్కిట్ పోటీల్లో మొదటి బహుమతిగా తెలంగాణ రెసిడెన్షియల్ స్కూల్ హోతి-కె రూ.10 వేలు, రెండో బహుమతిగా జిన్నారం మండలం బొల్లారం జడ్పీ ఉన్నత పాఠశాల రూ.8 వేలు, మూడో బహుమతిగా అందోల్ మండలం కంసాన్‌పల్లి జిల్లా పరిషత్ పాఠశాల రూ.5 వేలు, అదేవిధంగా పాటలు, కవితల పోటీల్లో మొదటి బహమతి కింద సదాశివపేట కేజీబీవీ విద్యార్థిని మానస రూ.5 వేలు, రెండో బహుమతిగా తెలంగాణ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాల విద్యార్థినులు శాంభవి, వైష్ణవి రూ.4 వేలు, మూడో బహుమతిగా బొల్లారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన నీలిమ రూ.3 వేల నగదు బహుమతి గెలుచుకున్నారు. వీరికి బుధవారం డీఈవో వెంకటేశ్వర్లు నగదు బహుమతిని అందజేశారు. ఈ కార్యక్రమంలో సీఎంవో వెంకటేశం, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులకు రూ.1.25 లక్షల స్టడీ మెటీరియల్స్, మైక్రోస్కోప్ పంపిణీ



వేలూర్, సీతారాంపల్లి పాఠశాలల విద్యార్థులకు స్టడీ మెటీరియల్స్, మైక్రోస్కోప్ అందజేస్తున్న అట్ల శ్యాంసుందర్‌రెడ్డి దంపతులు

వర్గల్, జూలై 10: వర్గల్ మండలం వేలూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, సీతారాంపల్లి ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు వేలూర్ గ్రామానికి చెందిన అట్ల శ్యాంసుందర్‌రెడ్డి, కిరణ్మయి దంపతులు కుమారుడు రిషిత్‌రెడ్డి జన్మదినం సందర్భంగా రూ.1.25 లక్షల విలువ చేసే స్టడీ మెటీరియల్స్, మైక్రోస్కోప్‌ను బుధవారం అందజేశారు. ఐదేళ్లుగా ప్రతీ సంవత్సరం అట్ల రిషిత్‌రెడ్డి పుట్టినరోజు సందర్భంగా పలు పాఠశాల్లో చదవుతున్న విద్యార్థులకు స్టడీ మెటీరియల్స్‌ను అందిస్తుండడం చాలా సంతోషంగా ఉన్నదని శ్యాంసుందర్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాలల ఉపాధ్యాయులు, ఎస్ఎంసీ చైర్మన్ ఉమలతాగోవర్ధన్‌గౌడ్, నాయకులు శ్రీనివాస్ రెడ్డి, సంతోష్‌గుప్తా, విద్యార్థులు పాల్గొన్నారు.

పాదరక్షల టెండర్‌దారుడి అక్రమ వసూలు

● మల్లన్న ఆలయాధికారులకు భక్తుల ఫిర్యాదు

చేర్యాల, జూలై 10: కొమురవెల్లి మల్లికార్జునస్వామి ఆలయ ఆవరణలో పాదరక్షలు భద్రపరిచే టెండర్‌దారుడు టెండర్ నిబంధనలు గాలికి వదిలేసి భక్తుల నుంచి అక్రమ వసూలుకు పాల్పడటంతో పాటు దురుసుగా ప్రవర్తించిన తీరుపట్ల పలువురు భక్తులు ఆలయాధికారులకు ఫిర్యాదు చేశారు. కరీనంగర్ జిల్లాకు చెందిన సుధీర్‌కుమార్, సురేశ్ తదితరులు హైదరాబాద్‌కు చెందిన తమ బంధువులతో కలిసి బుధవారం మల్లన్న దర్శనం కోసం కొమురవెల్లికి చేరుకున్నారు. ఆలయ ఆవరణలో చెప్పుల స్టాండు వద్ద వారి పాదరక్షలు భద్రపరిచారు. టెండర్ నిబంధనల మేరకు ఒక్కో జతకు రూ.5 చొప్పున వసూలు చేయాలి. ఇదే విషయమై టికెట్‌పైనా ముద్రించినప్పటికీ టెండర్‌దారుడు అంకెను దిద్ది రూ.10 చొప్పున డిమాండ్ చేశాడు. అధికంగా డబ్బులు అడగటమేంటని సుధీర్‌కుమార్, సురేశ్ ప్రశ్నించడంతో టెండర్‌దారులు వాగ్వివాదానికి పాల్పడ్డాడు. లక్షలాది రూపాయలు పెట్టి వేలం పొందామని, ఆలయాధికారులే అధికంగా డబ్బులు తీసుకోవాలని తమకు చెప్పారని, ప్రశ్నించడానికి మీరెవరంటూ దురుసుగా మాట్లాడాడు. దీంతో వారు ఈవో కార్యాలయంలో లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. అక్రమ వసూలుకు పాల్పడుతున్నా ఆలయాధికారులు చోద్యం వహిస్తున్నారని, వారిపై కూడా దేవాదాయ కమిషనర్‌కు ఫిర్యాదు చేస్తామని తెలిపారు.

మట్టిని తరలిస్తున్న టిప్పర్ సీజ్



నార్సింగి పీఎస్‌లో టిప్పర్

చేగుంట/మనోహరాబాద్, జూలై 10: నార్సింగి మండల పరిధి జప్తిశివనూర్ గ్రామ శివారులోని అమ్మకుంట నుంచి మట్టి అక్రమ రవాణా చేస్తున్న టిప్పర్‌ను పోలీసులు బుధవారం పట్టుకొని సీజ్ చేశారు. నార్సింగి ఎస్‌ఐ అహ్మద్ మొయినోద్దీన్ మాట్లాడుతూ గ్రామ శివారులోని అమ్మకుంటలో మట్టి అక్రమ తవ్వకాలు జరుపుతున్నారన్న సమాచారం మేరకు.. అక్కడికి వెళ్లి టిప్పర్‌ను పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామన్నారు. ఎవరైనా మట్టి అక్రమ తవ్వకాలు చేపట్టి రవాణా చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మనోహరాబాద్‌లో మట్టి అక్రమంగా తరలిస్తున్న టిప్పర్‌ను పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఎస్‌ఐ సుభాష్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. మనోహరాబాద్ మండలం రంగాయపల్లి శివారులో మంగళవారం రాత్రి అనుమతులు లేకుండా మట్టి తరలిస్తున్నారని సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని టిప్పర్‌ను పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనుమతులు లేకుండా మట్టి తరలిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్‌ఐ సుభాష్‌గౌడ్ హెచ్చరించారు.

రేపు ఉమ్మడి మెదక్ జిల్లా జట్టు క్రికెట్ ఎంపికలు

సంగారెడ్డి అర్బన్, జూలై 10: హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సంగారెడ్డిలోని ఎంఎస్ అకాడమీలో ఈనెల 12న ఉమ్మడి మెదక్ జిల్లా అండర్-25 జట్టు క్రికెట్ ఎంపికలు నిర్వహించనున్నట్లు మెదక్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ సెక్రటరీ రాజేందర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన జట్టు ఈ నెలలో జరగనున్న హెచ్‌సీఏ బీ1 డివిజన్ టుడే లీగ్‌లో పాల్గొంటారని పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన క్రీడాకారులు ఒరిజినల్ బర్త్ సర్టిఫికెట్, రెండు ఫొటోలు, ఆధార్‌కార్డుతో ఉదయం 10 గంటల వరకు హాజరుకావాలని ఆయన సూచించారు.

'అగ్నివీర్ వాయు' నియామకాలకు దరఖాస్తుల ఆహ్వానం



నీల చంద్రం

రాయపోల్, జూలై 10: భారత వాయుసేనలో 'అగ్నివీర్'గా పనిచేసేందుకు అవివాహితులైన అభ్యర్థుల నుంచి ప్రభుత్వం దరఖాస్తులు తీసుకోవడం ప్రారంభించిందని రిటైర్డ్ ఆర్మీ జవాన్, గజ్వేల్ ఆజాద్ డిఫెన్స్ అకాడమీ చైర్మన్ నీల చంద్రం పేర్కొన్నారు. అర్హులైన అభ్యర్థులు 28లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని చంద్రం సూచించారు.

గ్రానైట్ షాపులో దొంగతనం

● స్మార్ట్ టీవీతో పాటు నగదు అపహరణ

రామాయంపేట, జూలై 10: పట్టణంలోని ఓ గ్రానైట్ షాపులో మంగళవారం రాత్రి దొంగతనం జరిగింది. వెనుక డోర్ బద్దలు కొట్టి చొరబడ్డ దొంగ గల్లా పెట్టెలోని కొంత నగదుతో పాటు స్మార్ట్ టీవీ, కొన్ని కరెంట్ వైర్లను ఎత్తుకెళ్లాడు. బుధవారం షాప్ తెరిచిన యజమాని సాగర్ దొంగతనం జరిగిందని గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.





శివ్వంపేట మండలం నవాబ్ పేట్ గ్రామంలో నీరు లేక ఎండిపోతున్న రైతు శ్రీనివాసరెడ్డి చెందిన పత్తి పంట

వర్షాలు లేక ఎండుతున్న పత్తి పంట

● పెట్టుబడి కూడా రాదేమోనని ఆందోళన చెందుతున్న రైతులు

శివ్వంపేట, జూలై 10: వర్షాకాలం ప్రారంభమై నెలరోజులవుతున్నా ఇప్పటివరకు ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పైగా ఖరీఫ్ సీజన్ కూడా ఇంకా కొద్దిరోజులు గడిస్తే పూర్తవుతుండడంతో వరుణ దేవుని కరుణ కోసం గంపెడాశలతో ఎదురుచూస్తున్నారు. పునర్వసు కార్తెలో కూడా వర్షాలు కురవకపోవడంతో రైతుల్లో ఆందోళన మొదలైంది. వర్షాల జాడ లేకపోవడంతో పెట్టిన పెట్టుబడి వస్తుందో.. రాదోనని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండల పరిధిలో నవాబ్‌పేట్ గ్రామంలో రైతులు నల్ల రేగడు భూముల్లో ఎక్కువశాతం పత్తి పంట సాగుచేస్తున్నారు. గ్రామంలో వందకు పైగా ఎకరాల్లో పత్తి సాగుచేశారు. పంట వేసి నెలకు గడుస్తున్నా వర్షాలు కురవకపోవడంతో వేసిన పత్తి పంట ఎండుముఖం పడుతుందని రైతులు ఏనుగు పద్మారెడ్డి, చిన్న నర్సారెడ్డి, సయ్యద్ బాబాలు ఆవదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెండురోజుల్లో వర్షాలు కురవకుంటే పత్తి పంట పూర్తిగా ఎండిపోతుందని బోరు బావుల్లో కూడా నీటిమట్టం తగ్గడంతో పంటకు నీరు అందడం లేదని వాపోతున్నారు.

కేంద్ర వాణిజ్య శాఖ పేటెంట్ అధికారిగా రాథోడ్ రామేశ్వర్




తల్లిదండ్రులతో రాథోడ్ రామేశ్వర్

కంగ్టి, జూలై 10: సంగారెడ్డి జిల్లా కంగ్టి మండలం బోర్గి తండాకు చెందిన రాథోడ్ రామేశ్వర్ కేంద్ర వాణిజ్య మంత్రిత్వ శాఖలో పేటెంట్ అధికారిగా ఉద్యోగం సాధించారు. అంతకు ముందు పలు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన ఆయన తాజాగా జాతీయ స్థాయిలో ఎన్‌టీఏ నిర్వహించిన పరీక్షలో 380వ ర్యాంకు సాధించి ఈ ఉద్యోగాన్ని దక్కించుకున్నారు. తండాలోని నిరుపేద కుటుంబానికి చెందిన ఫుల్‌సింగ్, సుమన్‌బాయి దంపతుల కుమారుడైన రామేశ్వర్ నారాయణఖేడ్‌లోని ఆశ్రమ పాఠశాలలో అయిదవ తరగతి వరకు, పదవ తరగతి వరకు నల్లవాగు గురుకుల పాఠశాలలో చదివారు. బీవీఆర్ఐటీ ఇంజనీరింగ్ కళాశాలలో బయోమెడికల్ ఇంజనీరింగ్ పూర్తి చేశారు. ఇదే సమయంలో గ్రామపంచాయతీ కార్యదర్శుల నియామక పరీక్షలకు హాజరైన రామేశ్వర్ జూనియర్ పంచాయతీ కార్యదర్శిగా ఎంపికై సిర్గాపూర్ మండలంలోని వంగ్దల్ గ్రామపంచాయతీ కార్యదర్శిగా 10 మాసాల పాటు పని చేశాడు. కానిస్టేబుల్ నియామకాలకు జరిగిన పరీక్షల్లో ఏఆర్ కానిస్టేబుల్‌గా ఎంపికయ్యాడు. పాలిటెక్నిక్ లెక్చరర్‌గా ఎంపికయ్యారు. కందిలోని ఐఐటీలో విధులు నిర్వహిస్తున్న క్రమంలో ఎన్‌టీఏ పరీక్ష రాసి జాతీయ స్థాయి ఉద్యోగానికి ఎంపికయ్యారు. అంచెలంచెలుగా ఎదిగిన రామేశ్వర్‌ను గ్రామస్థులు అభినందిస్తున్నారు.

ప్రైవేట్‌కు దీటుగా సర్కారు బడులు

- తరగతి గదుల్లో డిజిటల్ బోర్డుల ఏర్పాటు
- విద్యార్థుల్లో ఉత్సాహం



అల్లాదుర్గంలోని బాలికల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో డిజిటల్ బోర్డు ద్వారా విద్యార్థులకు బోధిస్తున్న ఉపాధ్యాయుడు

అల్లాదుర్గం, జూలై 10: ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలోనూ విద్యార్థులకు మెరుగైన వసతులతో పాటు విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యాబోధన అందించేందుకు ప్రభుత్వం కృషిచేస్తోంది. పాఠశాలలోని విద్యార్థులకు మెరుగైన వసతులు, మౌలిక సదుపాయాలను కల్పించేందుకు ప్రభుత్వం అమ్మ ఆదర్శ పాఠశాలల పేరుతో లక్షలాది రూపాయలు వెచ్చిస్తూ పనులు చేపట్టింది. రోజురోజుకు పెరుగుతున్న సాంకేతిక పరిజ్ఞానంతో పాఠశాలలోని పాత కాలం నాటి బోర్డు (చెక్క) స్థానంలో డిజిటల్ బోర్డులను ఏర్పాటు చేస్తూ విద్యార్థులను ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక చొరవ చూపుతోంది. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేస్తున్న ఈ డిజిటల్ బోర్డులో భాగంగా మెదక్ జిల్లా అల్లాదుర్గం మండలంలోని జిల్లా పరిషత్ (బాలికల)ఉన్నత పాఠశాలలో వీటిని ఏర్పాటు చేసింది. ఈ డిజిటల్ బోర్డుతో ఎటువంటి చాక్‌పీస్, ఇంకును వాడకుండా బోర్డుపై రాస్తూ విద్యార్థులకు పలు పాఠ్యాంశాలను సులభతరంగా అర్థమయ్యే విధంగా, క్యూఆర్ కోడ్ ద్వారా వీడియో పాఠాలను బోధించవచ్చునని, పాఠాలను రికార్డు చేసి ఉపాధ్యాయులు లేని సమయంలోనూ ఈ పాఠశాల బోధించవచ్చునని ఉపాధ్యాయులు తెలియజేస్తున్నారు. పాఠ్యాంశాలతో పాటు టూడీ, త్రీడీ చిత్రాలను విద్యార్థులకు సులభతరంగా వివరించవచ్చునని వారు తెలిపారు.


ఈ బోర్డుతో ఎన్నో ప్రయోజనాలు

విద్యార్థులకు సులభతరంగా విద్యాబోధన చేసేందుకు వీలుగా ఉన్న ఈ డిజిటల్ బోర్డు విద్యార్థులకు మరెన్నో ప్రయోజనాలను చేకూరుస్తుంది. విద్యార్థులు పీడీఎఫ్ ద్వారా టెస్ట్ బుక్స్‌ను చూసే వీలుండగా, గణితం టూల్స్ ద్వారా గణిత పటములను గీయవచ్చునని, సామాన్యశాస్త్రానికి సంబంధించిన ప్రయోగాలను కూడా వీడియోలు తిలకించి నేర్చుకోవచ్చునని, ప్రభుత్వం నిర్వహించే లైవ్ కార్యక్రమాలను తిలకించవచ్చునని ఉపాధ్యాయులు వివరిస్తున్నారు. డిజిటల్ బోర్డుల ఏర్పాటుతో విద్యార్థుల్లో ఉత్సాహం మరింత పెరిగిందని, దీంతో పరీక్షా ఫలితాల్లోను చక్కటి ఉత్తీర్ణత ఫలితాలు వస్తాయని విద్యార్థుల తల్లిదండ్రులు బావిస్తున్నారు.



పాఠాలను శ్రద్ధతో వింటున్న విద్యార్థులు

అర్థమయ్యే విధానంతో బోధన



డిజిటల్ బోర్డు ద్వారా ఉపాధ్యాయులు పాఠ్యాంశాలను బోధిస్తుండటంతో సులభంగా అర్థమవుతుంది. టూడీ, త్రీడీ చిత్రాలను బోర్డు ద్వారా తిలకిస్తుండటంతో తమకు ఎంతో దోహదపడుతుంది. గతంలో జరిగిన పాఠ్యాంశాలను తిరిగి వినేందుకు ఉపయోగకరంగా ఉంది.

- రేణుకా, 10వ తరగతి విద్యార్థిని

చక్కటి ఉత్తీర్ణత ఫలితాలు వస్తాయి



డిజిటల్ బోర్డు ఏర్పటుతో తమలో నైపుణ్యం పెంచేలా ఉపాధ్యాయులు విద్యాబోధన చేస్తుండడంతో పరీక్షా ఫలితాల్లో చక్కటి ఫలితాలు లభిస్తాయి. ఉపాధ్యాయులు బోధించే పాఠ్యాంశాలు ప్రతీ ఒక్కటి చాలా అవగాహన కలిగిస్తున్నాయి.

- అరవింద్, 10వ తరగతి విద్యార్థి

కార్మిక వ్యతిరేక విధానాలను విడనాడాలి

● సీఐటీయూ నాయకులు

గజ్వేల్, జూలై 10: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక వ్యతిరేక విధానాలను వెంటనే విరమించుకోవాలని సీఐటీయూ సిద్దిపేట జిల్లా ఉపాధ్యక్షుడు బండ్ల స్వామి డిమాండ్ చేశారు. కార్మికుల కోరికల దినోత్సవం సందర్భంగా గజ్వేల్‌లోని ఐవోసీ బిల్డింగ్ ఆవరణలో సీఐటీయూ ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం ఆర్డీవో బన్సీలాల్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే పరిష్కరించాలని, కార్మిక వ్యతిరేక విధానాలను విరమించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కన్వీనర్ సందిటి రంగారెడ్డి, సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు నాసగోని వేణుగోపాల్, సీఐటీయూ నాయకులు వెంకటాచారి, మల్లయ్య, రాజులు, రమేష్, రామారావు, మహేందర్‌రెడ్డి, మనోజ్‌కుమార్, శ్రీనివాస్, లక్ష్మణ్, పరుశురాములు, కార్మికులు పాల్గొన్నారు


నారాయణరావుపేట: తహసీల్‌లో వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు

● **కుకునూరుపల్లి:** కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను విడనాడకపోతే తగిన బుద్ధి చెప్తామని సీఐటీయూ మండల అధ్యక్షుడు భోగి సాయికుమార్ హెచ్చరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్రంలో మూడోసారి అధికారం చేపట్టిన బీజేపీ సంస్కరణలు, ప్రైవేటీకరణకు అనుకూలంగా వ్యవహరిస్తున్నదని, బొగ్గు గనులు వేలం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు నరహరి, కుమార్, లక్ష్మణ్, గణేష్, కనకయ్య, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

● **నారాయణరావుపేట:** కార్మికులకు ఉద్యోగ భద్రత, కనీస వేతనం అమలు చేయాలని సీఐటీయూ మండల నాయకులు తూనికి శ్రీకాంత్ డిమాండ్ చేశారు. సీఐటీయూ నారాయణరావుపేట మండల కమిటీ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి, కార్మికుల డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ ప్రభాకర్‌కు అందజేశారు. కార్యక్రమంలో గ్రామపంచాయతీ


కొండపాక: తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు


వర్గల్: తహసీల్దార్ బాల్‌రాజుకు వినతిపత్రం అందజేస్తున్న గ్రామపంచాయతీ కార్మికులు

వర్కర్లు రాజలింగం, భూపతి, మల్లయ్య, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

● **వర్గల్:** కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక వ్యతిరేక విధానాలను వెంటనే విరమించుకోవాలని సీఐటీయూ జిల్లా నాయకులు వెంకటచారి డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట గ్రామపంచాయతీల కార్మికులతో కలిసి నిరసన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మండల సీఐటీయూ నాయకులు బాబురావు, గ్రామపంచాయతీల కార్మికులు భిక్షపతి, కనకయ్య, ఎల్లం, రాజు ఉన్నారు.

● **కొండపాక:** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్నాయని సీఐటీయూ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట బుధవారం ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల అధ్యక్షుడు జాలిగామ ప్రభాకర్, జిల్లా కమిటీ సభ్యులు బర్మ కొమురయ్య, పల్లే శ్రీనివాస్, కొమ్ము నర్సింహులు,


దౌల్తాబాద్: తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న సీఐటీయూ నాయకులు

సాయి, ఐలయ్య, అంజయ్య, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి తాటోజు రవీంద్రచారి, కొమురవెల్లి కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

● **దౌల్తాబాద్:** కార్మికులకు కనీసం వేతనం అమలు చేయాలని సీఐటీయూ జిల్లా కోశాధికారి గొడ్డుబర్ల భాస్కర్ డిమాండ్ చేశారు. సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులకు మద్దతుగా మండల తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో బాల్‌రాజు, అశోక్, మల్లేశం, మల్లమ్మ, బాలవ్వ, అంజయ్య ఎల్లం, దాదాకాన్, అంజయ్య, రాములు తదితరులు పాల్గొన్నారు.

● **నంగునూరు:** కార్మికులకు కనీస వేతనం ఇవ్వాలని సీఐటీయూ జిల్లా నాయకులు దేవులపల్లి రాజమౌళి డిమాండ్ చేశారు. కార్మికుల కోర్కెల దినోత్సవం సందర్భంగా సీఐటీయూ నంగునూరు మండల ఆధ్వర్యంలో తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. కార్యక్రమంలో హమాలీ యూనియన్ సంఘం నాయకులు అనరాజు ఎల్లయ్య, దేవులపల్లి బాలరాజు, గ్రామ పంచాయతీ కార్మికుల సంఘం ఉపాధ్యక్షుడు పిల్లి. రవీందర్, ప్రధాన కార్యదర్శి చిట్యాల కనకయ్య, కార్యదర్శి బెల్లం బాలయ్య, దేవులపల్లి బాలనరసవ్వ, జీడికంటి కనకవ్వ, మన్నె యాదవ్వ, రేణుక, కిషన్, శేఖర్, బలరాం, నర్సింహులు, బెల్లం శ్రీను, సుధాకర్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడి మృతి

మిరుదొడ్డి, జులై 10: రోడ్డుప్రమాదంలో గాయపడిన ఓ యువకుడు చికిత్స పొందుతూ మృతిచెందాడు. మండలంలోని ధర్మారం, ఆరెపల్లి గ్రామాల మధ్య పదకొండురోజుల క్రితం జరిగిన రోడ్డుప్రమాదంలో గాయాలైన యువకుడు సిద్దిపేట ఆస్పత్రిలతో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. సిద్దిపేటకు చెందిన మహ్మద్ సోహెల్ (24) అనే యువకుడు మిరుదొడ్డి మండలం మల్లుపల్లి గ్రామంలో క్రికెట్ ఆడేందుకు గత నెల 29న సిద్దిపేట నుంచి వస్తూ, ధర్మారం, ఆరెపల్లి గ్రామాల మధ్య నిలిపి ఉంచిన ఆటో ఢీకొట్టాడు. తీవ్రగాయాలపాలైన అతడిని ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం సాయంత్రం మృతి చెందారు.

'కలెక్టరేట్ ముట్టడిని విజయవంతం చేయాలి'

గజ్వేల్, జూలై 10: నేడు జరిగే సిద్దిపేట జిల్లా కలెక్టరేట్ ముట్టడిని జయప్రదం చేయాలని ఎస్‌ఎఫ్ఐ గజ్వేల్ డివిజన్ కార్యదర్శి నాచారం శేఖర్ పిలుపునిచ్చారు. ఎస్‌ఎఫ్ఐ గజ్వేల్ డివిజన్ ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని పట్టణంలోని ఎస్‌ఎఫ్ఐ కార్యాలయంలో బుధవారం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఐదు సంవత్సరాల నుంచి విద్యార్థులకి స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయడంలేదని, అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ కూడా గత ప్రభుత్వం మాదిరిగానే వ్యవహరిస్తున్నదని ఆరోపించారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు నేడు జరిగే కలెక్టరేట్ ముట్టడిలో విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. ఈ సమావేశం ఎస్‌ఎఫ్ఐ డివిజన్ అధ్యక్షుడు కోనేరు ప్రవీణ్, ఉపాధ్యక్షుడు ప్రణయ్, నాయకులు వేముల ప్రవీణ్‌శేఖర్, లోకేష్ తదితరులున్నారు.

సమయం కాకముందే బ్యాంకు గేటుకు తాళం

బెజ్జంకి, జూలై 10: నగదు లావాదేవీలు నిర్వహించుకునేందుకు బ్యాంకుకు వచ్చిన ఖాతాదారుల పట్ల బ్యాంకు సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఖాతాదారులు ఆరోపిస్తున్నారు. మండల కేంద్రంలోని ఆంధ్రా బ్యాంకు (యూనియన్ బ్యాంకు)కు మండలంలోని ఓ గ్రామానికి చెందిన వ్యక్తి ఖాతా తెరవడానికి ఉదయం రాగా సాయంత్రం వరకు వేచి ఉండాలని బ్యాంకు సిబ్బంది చెప్పారు. ఈ క్రమంలో సదరు వ్యక్తి ఖాతా ఇవ్వాలని 3.30 గంటలకు బ్యాంకు సిబ్బందిని కోరగా సమయం దాటి పోయిందని, బ్యాంకుకు అనుసంధానమైన వ్యక్తితో ఫారాన్ని నింపుకురావాలని సిబ్బంది బదులివ్వడంతో ఆ వ్యక్తి కంగుతిన్నాడు. ఉదయం నుంచి సాయంత్రం వేచి ఉన్న కూడా ఖాతా ఎందుకు ఇవ్వలేదని సదరు వ్యక్తి బ్యాంకు సిబ్బందిని నిలదీశాడు.


పనివేళలోనే గేటు మూసివేయడంతో నిరీక్షిస్తున్న ఖాతాదారులు

పండ్లు, పూల మొక్కలు పంపిణీ

హుస్నాబాద్ టౌన్, జూలై 10: హుస్నాబాద్ పట్టణంలోని 17వ వార్డులో వన మహోత్సవంలో భాగంగా బుధవారం ఇంటింటికీ మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత పండ్లు, పూల మొక్కలను పంపిణీ చేశారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని కోరారు. రోడ్డుపై ఉండే మొక్కలకు నీరు పోసి రక్షించడం మన బాధ్యతగా గుర్తించాలన్నారు. కార్యక్రమంలో కమిషనర్ మల్లికార్జున్, కౌన్సిలర్ వల్లపు రాజు, శంకర్, రవికుమార్ తదితరులున్నారు.

'న్యాయవాదిపై దాడిచేసిన సీఐ, ఏఎస్ఐని విధుల నుంచి తొలగించాలి'


కోర్టు ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న న్యాయవాదులు

సిద్దిపేట క్రైం జూలై 10: సిద్దిపేట కోర్టులో పనిచేస్తున్న న్యాయవాది రవీందర్‌పై దాడి చేసిన సిద్దిపేట టూటౌన్ ఏఎస్ఐ ఉమారెడ్డిని, సీఐని వెంటనే విధుల నుంచి సస్పెండ్ చేసి, వారిపై క్రిమినల్ కేసు నమోదు చేసి విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తూ బుధవారం సిద్దిపేట బార్ అసోసియేషన్ కార్యవర్గం న్యాయవాదులు కోర్టు ఎదుట నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. కోర్టు నుంచి స్థానిక వన్‌టౌన్‌స్టేషన్ వరకు ర్యాలీగా వెళ్లి దాడి చేసిన వారిపై కేసు నమోదు చేయాలని ఫిర్యాదు చేశారు. అనంతరం జరిగిన సిద్దిపేట జిల్లా బార్ అసోసియేషన్ కార్యవర్గ సమావేశంలో న్యాయవాదిపై దాడికి నిరసనగా నేడు, రేపు రెండు రోజులపాటు కోర్టు విధులకు హాజరుకావద్దని తీర్మానించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జనార్ధన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ న్యాయవాదులు సాయిబాబా, శివాజీ, తాటికొండ రమేశ్, కర్రోల్ల రవిబాబు, యాదగిరి, సాయినారాయణ, పవన్, కార్తీక్, నగేష్, భూమిరాజ్, రేణుక, సూర్యకళ, ఎగ్జిక్యూటివ్ మెంబర్స్, న్యాయవాదులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలను సందర్శించిన డీఈవో

చేర్యాల, జూలై 10: చేర్యాల మండలం వేచరేణి గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత, బీడీకాలనీలోని ప్రాథమిక, బండపల్లి శివారు కాలనీలోని ప్రాథమిక పాఠశాలలను సిద్దిపేట జిల్లా విద్యాశాఖాధికారి శ్రీనివాస్‌రెడ్డి బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరును పరిశీలించారు. విద్యార్థులను ప్రశ్నించి బోధన తీరు ఆరా తీశారు. డీఈవో వెంట సీఆర్పీ రాజు ఉన్నారు.

అభివృద్ధిపై సమీక్షించే తీరిక లేదా?

● యూత్ కాంగ్రెస్ రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి సర్దార్‌ఖాన్

గజ్వేల్, జూలై 10: గజ్వేల్ ఎమ్మెల్యేగా ఇక్కడి అభివృద్ధి పనులపై సమీక్ష చేసే తీరిక కేసీఆర్‌కు లేదా అని యూత్ కాంగ్రెస్ రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి సర్దార్‌ఖాన్ ప్రశ్నించారు. గజ్వేల్ పట్టణంలోని మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి నివాసంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఇతర నియోజకవర్గాలకు సమయం ఇస్తున్న కేసీఆర్ గజ్వేల్ నియోజకవర్గానికి సమయం ఇవ్వడం లేదని, గజ్వేల్ ఎమ్మెల్యేగా నియోజకవర్గ అభివృద్ధిపై సమీక్ష చేసే తీరిక ఆయనకు లేకపోవడం దారుణమన్నారు. గజ్వేల్ ఎమ్మెల్యేగా ఉన్న మీ నాయకుడితో రాజీనామా చేయిస్తే తాము గెలిచి గజ్వేల్‌ను అభివృద్ధి చేయిస్తామన్నారు. వారితో నాయకులు సమీర్, గుంటుకు శ్రీనివాస్, నక్కరాములు, సయ్యద్ మతీన్, మోహన్నగారి రాజు, రాములు, నేత నాగరాజు, ఉమేశ్, వహీద్, అంజి, సురేశ్, కన్నాయాదవ్, జహీర్, ప్రవీణ్ తదితరులున్నారు.

జేఎన్‌టీయూ బాధ్యులపై చర్యలు తీసుకోవాలి

● డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఏగొండస్వామి

గజ్వేల్, జూలై 10: సంగారెడ్డి జిల్లా చౌటకూరు మండలం సుల్తాన్‌పూర్ జేఎన్‌టీయూ హాస్టల్ మెస్‌లో చట్నీలో ఎలుక ప్రత్యక్షమైన ఘటనలో బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఏగొండస్వామి డిమాండ్ చేశారు. గజ్వేల్ పట్టణంలో బుధవారం విద్యార్థులతో కలసి ఆయన విలేకరులతో మాట్లాడారు. అర్థాకలితో విద్యార్థులు అవస్థలు పడుతున్నారని, చదువులు పక్కదారి పడుతున్నాయని, అయినా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. పేద, బడుగు, బలహీన వర్గాల పిల్లల హాస్టల్ పరిస్థితి పశువుల పాకలా ఉందన్నారు. రామాయంపేట మోడల్ స్కూల్ ఘటనలో 20మంది విద్యార్థులు ఆసుపత్రి పాలు కావడానికి బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. పరిశుభ్రత పాటించేలా హాస్టల్ సిబ్బందికి ప్రభుత్వం స్పష్టమైన, కఠినమైన ఆదేశాలు ఇవ్వాలని కోరారు.


చేర్యాల పట్టణంలోని ఎమ్మార్సీ కార్యాలయ ప్రహరీ కూలి వారాలు గడుస్తున్నా పట్టించుకున్న నాథుడే కరువయ్యాడు. ప్రస్తుత విద్యాసంవత్సరం ఆరంభసమయంలో చేర్యాల మండలానికి ప్రభుత్వం సరఫరా చేసిన పాఠ్య పుస్తకాలలోడుతో వచ్చిన వాహనం ఢీకొనడంతో ప్రధానద్వార గేటు ప్రహరీ కూలిపోయింది. సుమారు నెలరోజులు కావస్తున్నా మరమ్మతులు చేపట్టకపోగా, కిందపడిన గేటును కూడా సవరించలేదు. ఇప్పటికైనా విద్యాశాఖాధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.
- చేర్యాల

సేవా దృక్పథం అలవర్చుకోవాలి

ములుగు, జూలై 10: సేవా దృక్పథం అందరూ అలవర్చుకోవాలని ములుగు మాజీ ఎంపీపీ ఉపాధ్యక్షుడు దేవేందర్‌రెడ్డి అన్నారు. మండలంలోని తునికిబొల్లారం ప్రభుత్వ పాఠశాలలో బొంబాయి విట్టల్ జ్ఞాపకార్థంగా కుటుంబసభ్యులు కుమారుడు నీళ్ల సాయి ఆధ్వర్యంలో బుధవారం విద్యార్థులకు నోట్‌పుస్తకాలు అందజేశారు. దేవేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. పేదలకు సహాయం చేసేందుకు ముందుకు రావాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఏకాంబరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, ముత్యంరెడ్డి, ప్రతాప్‌రెడ్డి, పరశురాం రెడ్డి, నరసింహారెడ్డి పాల్గొన్నారు.

ఆంగ్ల విద్యపై ప్రత్యేక తరగతులు

కోహెడ జూలై 10: మండలంలోని బస్వాపూర్‌లో కాకతీయ సాండ్ బాక్స్ డీస్పాండే ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆంగ్ల విద్యపై పట్టు సాధించడానికి విద్యార్థులకు బుధవారం తరగతులు ప్రారంభించారు. పాఠశాలలో విద్యార్థులు, తల్లిదండ్రులకు ఇంగ్లిష్ భాషా ప్రావీణ్యంపై జిల్లా సెక్టోరియల్ అధికారి భాస్కర్, ఫౌండేషన్ చీఫ్ సంతోష్ వివరించారు. విద్యార్థులకు ఆంగ్ల నైపుణ్యాన్ని మెరుగుపరుచుకునే మెళకువలు, జీవన నైపుణ్యాలు వివరించారు. కార్యక్రమంలో ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పద్మయ్య ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శంకరయ్య, అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్ నాగలక్ష్మి, ట్రైనర్ శ్రావణి, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

విద్యాశాఖ డైరెక్టర్‌ను కలిసిన ఉపాధ్యాయుడు మల్లికార్జున్

గజ్వేల్, జూలై 10: విద్యాశాఖ నూతన డైరెక్టర్‌గా పదవీబాధ్యతలు స్వీకరించిన నరసింహారెడ్డిని సీపీఎస్ సంఘ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మల్లికార్జున్ బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. విద్యాశాఖ డైరెక్టర్‌కు పూలమొక్కను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

తోటి మిత్రునికి బాల్య స్నేహితుల అపన్నహస్తం

దౌల్తాబాద్, జూలై 10: మండల పరిధిలోని శేరిపల్లి గ్రామానికి చెందిన చాకలి నాగరాజు 6 నెలల క్రితం రోడ్డు ప్రమాదంలో కాలువిరిగి మంచానికే పరిమితమయ్యాడు. అతడితో కలిసి చదువుకున్న తోటి మిత్రులు బుధవారం బాధితున్ని పరామర్శించి రూ.20 వేలు ఆర్థిక సాయం అందజేసి దాతృత్వం చాటుకున్నారు. కార్యక్రమంలో ముత్యంగారి యాదగిరి, నాగరాజు, శ్రావణ్, గణేష్, స్వామి, పెంటయ్య, యాదిరెడ్డి, రాజలింగం, భూపాల్, చంద్రం, రమేష్, రాములు, పోచయ్య, నర్సింహులు, భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

డెంగీ పట్ల అప్రమత్తంగా ఉండాలి

● రాయపోల్ వైద్యాధికారి మహారాజ్ బల్లా

రాయపోల్, జూలై 10: వర్షాకాలం ప్రారంభంకావడంతో డెంగీ వ్యాధికి కారణమయ్యే దోమలు ప్రబలే ప్రమాదం పొంచి ఉన్నదని రాయపోల్ వైద్యాధికారి మహారాజ్ బల్లా హెచ్చరించారు. దోమలు వృద్ధి చెందకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఇళ్లల్లో కానీ చుట్టుపక్కల కానీ నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్త పడాలని పేర్కొన్నారు.

'హామీలు అమలు చేయాలి'


తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ములుగు/అక్కన్నపేట, జూలై 10: కాంగ్రెస్ ఎన్నికల సమయంలో రైతులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయడంతో పాటు రుణమాఫీ చేసి రైతులను ఆదుకోవాలని బీజేపీ కిసాన్ మోర్చా అధ్యక్షుడు పల్లె నవీన్ ముదిరాజ్ బుధవారం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ కిసాన్‌మోర్చా సీనియర్ నాయకుడు నాన్నవేలు సుదర్శన్‌రెడ్డి, కిసాన్‌మోర్చా ప్రధాన కార్యదర్శి మధు, వీరేశం, నర్సింహులు, మల్లేష్, సత్యనారాయణ, భాస్కర్‌గౌడ్ పాల్గొన్నారు.

ఎన్నికల్లో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ నెరవేర్చాలని బీఆర్ఎస్ నియోజకవర్గ అధికార ప్రతినిధి ఐలేని మల్లికార్జున్‌రెడ్డి డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో బుధవారం విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసి ఆరు నెలలు గడుస్తున్నా హామీలను అమలు పరచడంలో విఫలం అయిందని ఆరోపించారు. గ్రామపంచాయతీ కార్మికులకు కూడా జీతాలు ఇవ్వడం లేదని విమర్శించారు.

ఉచిత వైద్య శిబిరం

కుకునూరుపల్లి, జూలై 10: మాత్‌పల్లి, లకుడారం గ్రామాల్లో బుధవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. మాత్‌పల్లిలో అతిథి హాస్టల్ వారి ఆధ్వర్యంలో, లకుడారంలో మెడిసిటీ హాస్పిటల్ వారి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు గ్రామస్థులను పరీక్షించి వారికి ఉచితంగా మందులను అందజేశారు. మాత్‌పల్లిలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో కాంగ్రెస్ కుకునూరుపల్లి మండల అధ్యక్షుడు విరుపాక శ్రీనివాస్‌రెడ్డి, మాజీ సర్పంచ్ బచ్చలి మహిపాల్ రోగులకు మందులను అందజేశారు. కార్యక్రమంలో గాడిచర్ల బాల్‌లక్ష్మి, మాజీ సర్పంచ్ రాజలింగం, నర్సింహులు, కిషన్, గ్రామస్థులు పాల్గొన్నారు.

మాజీ జడ్పీటీసీకి సన్మానం


మాజీలను సన్మానిస్తున్న గ్రామస్థులు

దూళిమిట్ట,జూలై 10: ఇటీవల పదవి విరమణ పొందిన కాంగ్రెస్ తాజా మాజీ జడ్పీటీసీ గిరికొండల్‌రెడ్డిని, ఎంపీటీసీ చెట్కూరి కల్యాణికమలాకర్‌యాదవ్‌ను బుధవారం గ్రామస్థులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్ నారోజు శ్రీనివాస్,మాజీ సర్పంచులు మెతుకు రాంరెడ్డి, దాసరి నర్సింహులు యాదవ్,బూర గంగాధర్, కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు సాగర్‌గౌడ్, గ్రామస్థులు, యువజన కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులకు..

మర్కుక్/కోహెడ, జూలై 10: మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో 8 సంవత్సరాలకు పైగా విధులు నిర్వహించి బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులకు, వారి స్థానంలో నూతనంగా పాఠశాలకు బదిలీపై వచ్చిన ఉపాధ్యాయులకు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకటేశం ఆధ్వర్యంలో బుధవారం వీడ్కోలు, స్వాగత సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారిని శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, రమణరావు, సిద్ధయ్య, వందన, గణేష్, మహిళా ఉపాధ్యాయురాళ్లు పాల్గొన్నారు.

కోహెడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి ఇటీవల బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు బుధవారం సన్మానం చేశారు. బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు కొండూరి రామకృష్ణ, బొద్దుల శ్రీరాములు, బైరి మనోహర్, పుల్లూరి విజయలక్ష్మిలను శాలువాలు కప్పి జ్ఞాపికలు అందజేసి సత్కరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మహమ్మద్ మహమూద్, ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ మంజుల, ఉపాధ్యాయులు పి. నగేష్, కె ఓదెలు, సంపత్, సద్గుణాచారి, రమేష్, అబ్దుల్ హమీద్, రవీందర్, దేవేందర్, రాజమౌళి, రమణ, గీత, సురేష్‌కుమార్, పుష్పలత, పాఠశాల కమిటీ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ట్రిబుల్ ఐటీకి ఎంపికైన విద్యార్థికి..

కుకునూరుపల్లి, జూలై 10: ట్రిబుల్ ఐటీకి ఎంపికైన విద్యార్థిని కొనాయిపల్లి మాజీ సర్పంచ్ మిట్టపల్లి రుషి సన్మానించారు. కార్యక్రమంలో గ్రామ ప్రత్యేకాధికారి ఏవో ప్రియదర్శిని, పంచాయతీ కార్యదర్శి కృష్ణ, ఉపసర్పంచ్ రమేష్, కోఆప్షన్ మెంబర్ నరేష్‌గౌడ్, సాయిరెడ్డి, ముష్టం స్వామి, రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలో పిల్లల ఎదుగుదల పరిశీలన


కుకునూరుపల్లి: పిల్లల ఎత్తును పరిశీలిస్తున్న సిబ్బంది, గ్రామ ప్రత్యేకాధికారి ప్రియదర్శిని

దూళిమిట్ట,జూలై 10: మండలకేంద్రంలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రంలో బుధవార ఎదుగుదల పరిశీలించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ టీచర్లు పిల్లల ఎత్తు, బరువు కొలిచి వివరాలను నమోదు చేసుకున్నారు. అనంతరం అంగన్‌వాడీ టీచర్లు మాట్లాడుతూ.. ఎత్తుకు తగ్గ బరువు లేని పిల్లల తల్లిదండ్రులు పిల్లల పట్ల తగిన జాగ్రత్తలు తీసుకుని బలవర్ధకమైన ఆహారం అందించాలన్నారు. కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రేఖా, పంచాయతీ కార్యదర్శి రాజు గౌడ్, అంగన్‌వాడీ టీచర్లు దుర్గభవాని, లక్ష్మి, రజిత, ఏఎన్ఎం స్వరూప, ఆశాకార్యకర్తలు, పిల్లల తల్లిదండ్రులు తదితరలు పాల్గొన్నారు.

● **కుకునూరుపల్లి:** పిల్లల ఎత్తు తెలుసుకోవడానికి ప్రభుత్వం ఎదుగుదల పరిశీలన కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఈ కార్యక్రమం కొనాయిపల్లిలో ముగిసింది. ఈ సందర్భంగా కుకునూరుపల్లి మండల ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మాధవిరెడ్డి మాట్లాడుతూ.. కలెక్టర్ ఆదేశానుసారం మండలంలోని ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలో 0-5 సంవత్సరాల పిల్లల కచ్చితమైన ఎత్తును పరిశీలించామన్నారు. కార్యక్రమంలో గ్రామ ప్రత్యేకాధికారి ప్రియదర్శిని, ఏఎన్ఎం నాగలక్ష్మి, అంగన్వాడీ టీచర్లు, ఆశావర్కర్లు, తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు కార్మికుల వినతి

రాయపోల్, జూలై 10: కేంద్రం తీసుకొచ్చిన లేబర్‌కోడ్‌లను రద్దు చేయాలని పంచాయతీ కార్మికులు డిమాండ్ చేశారు. బుధవారం ఈ మేరకు తహసీల్దార్ దివ్యకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్మికులు రాములు, వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.

నేడు హుండీ లెక్కింపు

వర్గల్, జులై 10: జిల్లాలో అత్యంత ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన వర్గల్ మండలం నాచారం నాచగిరి లక్ష్మీనృసింహస్వామి హుండీ లెక్కింపు నేడు దేవాదాయ, ధర్మాదాయ అధికారులు పర్యవేక్షణలో నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి ఎస్ అన్నపూర్ణ తెలిపారు. ఉదయం 10.00 గంటలకు హుండీ లెక్కింపు ప్రారంభమవుతుందన్నారు.

కెమెరా సృష్టికర్త వర్ధంతి


నివాళులర్పిస్తున్న ఫొటోగ్రాఫర్లు

మద్దూరు, జూలై10 : ఫొటో కెమెరా సృష్టికర్త లూయిస్ జాకస్ మండే డాగ్యురే 173వ వర్ధంతిని మండల కేంద్రంలో మండల ఫొటో గ్రఫీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో మండల ఫొటో, వీడియో గ్రాఫర్స్‌అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు కొరిగింజ శేఖర్, ఉపాధ్యక్షుడు దాసు మహేందర్, కోశాధికారి జగ్గని దయాకర్, సహాయ కార్యదర్శులు ఇప్పకాయల శ్రీకాంత్, పాకాల కిరణ్‌కుమార్ ఉన్నారు.

'లక్ష్యాన్ని ఏర్పరుచుకోవాలి'

కొండపాక, జూలై 10: విద్యార్థి దశ నుంచే లక్ష్యం ఏర్పరుచుకుని ఆ దిశగా కష్టపడి ఉన్నతులుగా ఎదగాలని వీఎంఆర్ ఫౌండేషన్ చైర్మన్ వంగ మహేందర్‌రెడ్డి అన్నారు. మండలంలోని సిరసనగండ్ల ఉన్నత పాఠశాలలో బుధవారం వీఎమ్‌ఆర్ ఫౌండేషన్ సహకారంతో రంగనాయక రచయితల సంఘం ఆధ్వర్యంలో జైత్రైత్రే, అర్ధాంగి పుస్తకాల ఆవిష్కరణ నిర్వహించారు. ఈ సందర్భంగా మహేందర్ రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థుల జీవితంలో వెలుగులు నింపి ఉన్నతమైన దారులను మార్గ నిర్దేశం చేసే ఉపాధ్యాయుల పాత్ర ఎంతో గొప్పదన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పెద్ది విఠల్, రంగనాయక రచయితల సంఘం అధ్యక్షుడు పిన్నింటి మహేంద్రారెడ్డి, పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ గ్రామ కమిటీ అధ్యక్షుడి ఎన్నిక

జగదేవ్‌పూర్, జూలై 10: మండలంలోని కాంగ్రెస్ తిగుల్ గ్రామ కమిటీ అధ్యక్షుడిగా ఉప్పల ప్రవీణ్‌కుమార్‌ను డీసీసీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి ఆధ్వర్యంలో బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ.. డీసీసీ అధ్యక్షుడు నర్సారెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, పీఏసీఎస్ మాజీ చైర్మన్ నరేందర్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ మంజుల మహేందర్‌రెడ్డి తదితరులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అలాగే గ్రామ కమిటీ యూత్ అధ్యక్షుడిగా కరుణాకర్, మైనార్టీ అధ్యక్షుడిగా కుద్దుస్‌ను ఎన్నుకున్నారు.

కుకునూరుపల్లి పాఠశాల జిల్లాలో మొదటిస్థానంలో ఉంటుంది

కొండపాక మండలం ఎంఈవో శ్రీనివాస్‌రెడ్డి

కుకునూరుపల్లి, జూలై 10: కుకునూరుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సౌకర్యాల్లో జిల్లాలోనే మొదటిస్థానంలో ఉంటుందని ఎంఈవో శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఎన్ఆర్ఈజీఎస్ పథకంలో భాగంగా నూతనంగా నిర్మించిన మూత్రశాలలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్పొరేట్‌కు దీటుగా సౌకర్యాలు పాఠశాలలో ఉన్నాయని, సౌకర్యాల్లోనే కాకుండా ప్రతిభావంతులైన ఉపాధ్యాయ బృందం అందుబాటులో ఉన్నదని అన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు సత్తయ్య, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ కాగిత నవనీత, మాజీ సర్పంచ్ మిట్టపల్లి రుషి, నరేష్, మిట్టపల్లి కృష్ణ, ఉపేందర్‌గౌడ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

డీఎస్సీని వాయిదా వేయాలి

● బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి రవీందర్‌గౌడ్

హుస్నాబాద్ టౌన్, జూలై 10: నిరుద్యోగుల కోరిక మేరకు డీఎస్సీ పరీక్షను వాయిదా వేయాలని బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి పచ్చిమట్ల రవీందర్‌గౌడ్ కోరారు. హుస్నాబాద్‌లో బుధవారం విలేకరులతో మాట్లాడారు. 10 సంవత్సరాల తరువాత డీఎస్సీ నిర్వహిస్తున్న దృష్ట్యా నిరుద్యోగులు కోరినట్లు 90 రోజుల సమయం ఇచ్చి పరీక్ష నిర్వహించాలన్నారు. తక్కువ సమయం ఇచ్చి పరీక్ష నిర్వహించడం వల్ల నిరుద్యోగులు చదువుకోవడానికి సమయం లేక ఒత్తిడికి లోనవుతారని పేర్కొన్నారు. ఈ సమావేశంలో బీఎస్పీ జిల్లా నాయకులు ఎనగందుల శంకర్, సుధాకర్, రాజు, శరత్ తదితరులున్నారు.

గ్రంథాలయానికి పుస్తకాల అందజేత


పుస్తకాలను ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు

కుకునూరుపల్లి, జూలై 10: లకుడారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గ్రంథాలయానికి ఉపాధ్యాయుడు బాల సాహిత్య పుస్తకాలను అందజేశారు. కుకునూరుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న వెంకటేశ్వర్లు లకుడారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు30 బాల సాహిత్య పుస్తకాలు అందజేశారు. ఆయన రచించిన ఉడతా ఓ బుడతా అనే పుస్తకాన్ని ప్రధానోపాధ్యాయ బృందంతో కలిసి ఆవిష్కరించారు.

నేడు తైబజార్ వేలం

దౌల్తాబాద్,జూలై 10: దౌల్తాబాద్ మండల కేంద్రంలో డీఎల్‌పీవో ఆదేశాల మేరకు నేడు ఉదయం 11 గంటలకు గ్రామ పంచాయతీ కార్యాలయంలో తైబజార్, పశువుల సంతకు వేలం నిర్వహిచనున్నట్లు పంచాయతీ కార్యదర్శి సతీష్ బుధవారం తెలిపారు. వేలంలో పాల్గొనే వారు ముందస్తుగా రూ.లక్ష డిపాజిట్ చేయాలని,వేలం దక్కించుకున్న వారు మొదటిరోజునే 50 శాతం డబ్బులు చెల్లించాలన్నారు.

బెంబేలెత్తిస్తున్న మట్టి తరలింపు వాహనాలు

● అర్ధరాత్రి అడ్డుకున్న గుమ్మడిదల గ్రామస్థులు

గుమ్మడిదల, జులై 10: కొన్ని రోజులుగా నర్సాపూర్ వైపు నుంచి గుమ్మడిదల మీదుగా అతివేగంగా నల్ల మట్టిని తరలిస్తున్న టిప్పర్లు, లారీలతో స్థానికులు బెంబేలెత్తిపోతున్నారు. రాత్రిపగలు తేడా లేకుండా మట్టి వాహనాలను జోరుగా నడిపిస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని పలువురు మండిపడుతున్నారు. మట్టి తరలింపు లారీల తీరుపై అగ్రహించిన స్వచ్ఛంద సంఘాలవారు, అంబేడ్కర్ యువజన సంఘాల సభ్యులు మంగళవారం రాత్రి 12 గంటల సమయంలో గుమ్మడిదల గ్రామంలోని కానుకుంట చౌరస్తా వద్ద మట్టి లారీలను అడ్డుకున్నారు. ఇటీవలే గుమ్మడిదలకు చెందిన సంజీవరెడ్డి అనే రైతును మట్టి టిప్పర్ ఢీకొనడంతో దుర్మరణం చెందాడు. ఈ ఘటన చోటుచేసుకుని వారం కూడా గడవక ముందే మళ్లీ మట్టి తరలింపు వాహనాలను


కానుకుంట చౌరస్తాలో మట్టి టిప్పర్ లారీలను అడ్డుకుంటున్న అంబేడ్కర్ యువజన సంఘం సభ్యులు

వేగంగా నడిపిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. డ్రైవర్లకు విశ్రాంతి ఇవ్వకపోవడం కారణంగానే ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని పలువురు ఆరోపిస్తున్నారు. ఇంత జరుగుతున్నా ఏ ఒక్క అధికారి కూడా మట్టి టిప్పర్లను కట్టడి చేయలేకపోతున్నారంటూ అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా మండల అధికారులు చర్యలు తీసుకోకుంటే కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు.